క్లుప్తంగా

బుగ్గ సంగమేశ్వరుడికి రూ.లక్ష విరాళం



దాతలను శేష వస్త్రంతో సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: జిల్లా కేంద్రం అనంతపురానికి చెందిన రిటైర్డ్ టీచర్ మాల్కరి ఆనంద రావు బుగ్గ సంగమేశ్వర ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేశారు. స్వామి దర్శనార్థం సోమవారం బుగ్గ సంగమేశ్వర ఆలయానికి విచ్చేసిన ఆయన.. ఈఓ క్రిష్ణయ్యకు నగదు అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. ఆయనకు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

తాడిపత్రి అర్బన్: పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని రైతు సంఘం తాడిపత్రి కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రబీ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదని గుర్తు చేశారు. పంటలకు కనీస ధరలు రాక నష్టపోతున్న తరుణంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

మొక్కజొన్న పంట జాగ్రత్తగా కాపాడుకోవాలి



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మొక్కజొన్న పంటను కత్తెర పురుగు, శెనగపచ్చ పురుగు ఆశించి పంట దెబ్బతింటున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చెంగ్రాయుడు సూచించారు. సోమవారం ఆయన ఉరవకొండ ఏడీఏ పద్మజ, గుంతకల్లు ఏఓ స్వాతితో కలిసి మండలంలోని దంచర్ల గ్రామంలో పర్యటించారు. మొక్కజొన్న పంటను పరిశీలించిన ఆయన రైతులకు సలహాలు, సూచనలను అందజేశారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు, శనగపచ్చ పురుగు ఆశించడంతోపాటు పంట సుడులుగా తిరిగిందన్నారు. మోతాదుకు మించి మందులు వాడటం వల్లనే పంట సుడులుగా మారిందన్నారు. అవసరమైన మేరకు మాత్రమే మందులను ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం పంటను ఆశించిన కత్తెర పురుగు, శనగపచ్చ పురుగు నివారణకు ఏమామెక్టిన్ మందు పిచికారీ చేయాలన్నారు.

స్త్రీ హింస మహా పాపం



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ షీబా

గుత్తి: స్త్రీ హింస మహా పాపమని ఆర్డీటీ డైరెక్టర్ షీబా, సీడీపీఓ ఢిల్లీశ్వరి అన్నారు. పట్టణంలోని నిజామి షాదీ ఖానాలో సోమవారం ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన 60 జంటలు(దంపతులు) హాజరయ్యారు. ఆర్డీటీ డైరెక్టర్, సీడీపీఓతోపాటు స్పానిష్ దేశస్తులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ ఈ సృష్టిలో భార్యభర్త బంధం చాలా పవిత్రమైందన్నారు. చిన్న చిన్న విషయాలకు విభేదించడం మంచిది కాదన్నారు. భార్యను అకారణంగా హింసించడం నేరమన్నారు. కలసి మెలిసి జీవిస్తామని జంటల చేత స్పానిష్ దేశస్తులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఓలు నాగమణి, లాలూస్వామి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

మందులు వాడితే క్షయ నయం



రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ అనుపమజేమ్స్

గార్లదిన్నె: సకాలంలో మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని టీబీ, ఎయిడ్స్, లెప్రసీ జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి, మండలంలో నమోదైన టీబీ, కుష్ఠు కేసుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీబీ విభాగం వైద్యాధి కారి శిరీష, పీహెచ్‌సీ వైద్యులు గౌతమి, వైద్యులు పాల్గొన్నారు.

అపార్ కష్టాలు అనంతం

- సచివాలయాల్లో అందని సేవలు
- మండల కేంద్రాల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు





తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మీ సేవ, జిరాక్స్ కేంద్రాల వద్ద గుమికూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు

గుంతకల్లు రూరల్: విద్యార్థుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసే క్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులకు తలపోటు తెప్పిస్తోంది. అపార్ నమోదుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందడం, సచివాలయాల్లో అపార్ సేవలు అందకపోవడం వంటి కారణాలతో వారాల తరబడి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మండల కేంద్రం చుట్టూ తిరగలేక నానాపాట్లు పడుతున్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకురావాలన్న మహోన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు సంక్షేమ పథకాలను సైతం నేరుగా వారి గుమ్మం దగ్గరకే అందిస్తూ వచ్చింది. దీంతో గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వ కార్యాలయాల గుమ్మం కూడా తొక్కే పనిలేకుండా వారి పనులు సవ్యంగా జరిగిపోయాయి.

కూటమి ప్రభుత్వం కొలువయ్యాక కష్టాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తరువాత ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పూర్తి వివరాల నమోదు కోసం అపార్ కార్యక్రమాన్ని చేపట్టింది. అపార్ నమోదులో భాగంగా ప్రతి విద్యార్థీ జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి. జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే ఆధార్‌లో తప్పులు ఏవైనా ఉంటే వాటిని సవరించి అపార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఇందుకోసం ముందుగా తమ పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థి పుట్టిన తేదీ వివరాలతో కూడిన స్టడీ సర్టిఫికెట్ తీసుకోవాలి, ఆ తరువాత గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్‌ను తీసుకోవాలి. వీటన్నిటినీ జోడించి జనన ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ విషయాలేవీ తెలియని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్లాలో, ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియక తమ పిల్లలను తీసుకొని అటు సచివాలయాలు, మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం అంటూ తిరుగుతూ పనులు జరగక, దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. అపార్ ఐడీ నమోదు కోసం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ఒకటంటే ఒక్క కేంద్రం ఏర్పాటు చేయలేదు కదా వారికి కనీస అవగాహన కూడా కల్పించలేకపోయారు.

సచివాలయాల్లో అందని అపార్ సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి సమస్యా సచివాలయంలోనే పరిష్కారం అయ్యేది. ప్రతి ధ్రువీకరణ పత్రం సచివాలయం ద్వారానే మంజూరయ్యేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయంలో పనులు జరగకపోగా ఏపనికి ఎక్కడికెళ్లాలో చెప్పే దిక్కుకూడా లేకుండా పోయిందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం చుట్టూ తిరుగుతూ నానాపాట్లు పడి పూర్తి దరఖాస్తును సిద్ధం చేసుకొని వీఆర్వో వద్దకు వెళితే..అక్కడ డబ్బు డిమాండ్ చేస్తున్నారన్నారు. జనన ధ్రువీకరణ పత్రం తహసీల్దార్ కార్యాలయంలోనే జరిగే పనికాదని, ఈ పని ఆర్డీవో కార్యాలయం వరకూ వెళ్లి చేయించాలంటే ఖర్చు అవుతుందని లేదంటే మీ పని ఎప్పుడు అవుతుందో కూడా చెప్పలేమని భయపెడుతూ డబ్బు గుంజుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

అపార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ ధర్నా

గుంతకల్లు రూరల్: అపార్ నమోదు కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. అపార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సురేంద్రబాబు, వెంకీలు మాట్లాడుతూ ఆధార్‌లో సవరణలు, బర్త్ సర్టిఫికెట్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు గత నెలరోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అపార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

వారం రోజులుగా తిరుగుతున్నా..



నా కుమారుడు రాజేష్ మొలకలపెంట జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. బర్త్ సర్టిఫికెట్ కోసం ముందుగా సచివాలయం వెళ్లాం. ఇక్కడు కాదు ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్లమన్నారు. అక్కడకు వెళ్తే లాయర్ నోటరీ కావాలన్నారు. అదీ తెచ్చాక పంచాయతీ కార్యదర్శి ఇచ్చే సర్టిఫికెట్ కావాలన్నారు. ఇలా వారం రోజులుగా తిరుగుతున్నా పని జరగడం లేదు.

– దండు వీరహనుమన్న, మొలకలపెంట

జేఈఈ అప్లికేషన్ రిజెక్ట్ అయింది



నా కూతురు ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. గతంలోనే ఆమెకు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నప్పటికీ ఆధార్ సవరణ కోసం వెళ్తే మళ్లీ కొత్తగా బర్త్ సర్టిఫికెట్ కావాలన్నారు. ఆ సర్టిఫికెట్ కోసం వారం రోజులుగా తిరుగుతున్నా పని కాలేదు. ఉన్న వివరాలతోనే జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకోగా రిజెక్ట్ అయింది. రెండో దఫా మెయిన్స్‌కు అయినా పని అవుతుందో లేదో అని భయంగా ఉంది. – నాగరాజు, కసాపురం

కాలేజీకి సెలవు పెట్టాడు



నా కొడుకు రామ్ చరణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బర్త్ సర్టిఫికెట్ కోసం వారం రోజులుగా కాలేజీకి సెలవుపెట్టి తిరుగుతున్నా పని జరగలేదు. దీంతో రెండు రోజులుగా వాడికి తోడు నేను వచ్చాను. గ్రామంలో సచివాలయం ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. పనులు వదులుకొని తిరగాల్సి రావడంతో చాలా ఇబ్బందిగా ఉంది. – సరస్వతి, వైటీ చెరువు

మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలాలను కాపాడండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో అన్యాక్రాంతమవుతున్న మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలాలను కాపాడాలని కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కృపాకర్, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు కోరారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువ చేసే మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా వాటిని రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ప్రశ్నించారు. టీపీఓ సత్తార్ మాట్లాడుతూ పట్టణంలోని 102 ఎల్.పీల్లో 58 ఓపెన్ సైట్‌లు ఉన్నాయని, వాటి రక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు లేఖ పంపామన్నారు. వీటితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో నీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం పట్టణంలో రోడ్డు ప్యాచ్ వర్క్‌ల విషయమై టీడీపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు వాగ్వాదం చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కమిషనర్ నయీమ్ అహ్మద్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఓను సరెండర్ చేయాలని కౌన్సిల్ తీర్మానం

గుడివాడ నుంచి గుంతకల్లు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన ఆర్ఓ (రెవెన్యూ అధికారి) తారక్‌నాథ్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్న కౌన్సిల్ సభ్యుల ప్రతిపాదనలను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ)కు పంపేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా గతంలో ఇక్కడ ఆర్ఓగా పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారిని తిరిగి ఇక్కడికి రప్పించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



గుత్తిలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు

గుత్తి/తాడిపత్రి రూరల్/బుక్కరాయసముద్రం/పామిడి/యల్లనూరు: రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తప్పవని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గుత్తిలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో సోమవారం ఆటో డ్రైవర్లతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనిఫారం ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని అనంతపురం రోడ్డులో సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. అలాగే తాడిపత్రి పోలీసు స్టేషన్‌లో అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అదేవిధంగా బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై పలు వాహన డ్రైవర్లకు సీఐ కరుణాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆటో డ్రైవర్లకు సీఐ యుగంధర్ అవగాహన కల్పించారు. అదేవిధంగా యల్లనూరు మండలం తిరుమలాపురం క్రాస్‌లో ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ వాహనాల తనిఖీ చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ కోలుకోవాలని పూజలు

గుత్తి రూరల్: మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి త్వరగా కోలుకోవాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వారు స్వామికి పూజలు చేసి టెంకాయలు కొట్టారు. నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ప్రహ్లాద, వెంకటేశ్వర, హరినాథ్ పాల్గొన్నారు.

మృతుడు పొడరాళ్ల వాసి..

రేణిగుంట(చిత్తూరు): ఆర్టీసీ బస్సులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు అనంతపురం వాసిగా రేణిగుంట అర్బన్ పోలీసులు గుర్తించారు. గత సోమవారం తెల్లవారుజామున తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని ఏర్పేడు మండలం, మేర్లపాక స్టేజి వద్ద బస్సు ఎక్కి.. బస్సులోనే బుక్కరాయసముద్రం మండలం, పొడరాళ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(26) ఉరేసుకున్నాడు. మృతుడి ఫొటోలు ప్రసార మాధ్యమాల్లో రావడంతో బుక్కరాయసముద్రానికి చెందిన ఓ చర్చి పాస్టర్ గుర్తించి, మృతుడి తల్లిదండ్రులు రామకృష్ణ, తిప్పమ్మకు సమాచారమిచ్చారు. వారు మంగళవారం రేణిగుంట పోలీసులను ఆశ్రయించగా తిరుపతి ఎస్వీ వైద్యకళాశాల వద్ద వారికి శ్రీనివాసులు మృతదేహాన్ని అప్పగించారు. కాగా మృతుడు డిగ్రీ డిస్ కంటిన్యూ చేసి మద్యానికి అలవాటు పడి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జల్సాగా తిరిగేవాడని తెలుస్తోంది. ఇంటి నుంచి 15 రోజుల కిందట పారిపోయి వచ్చేసి, ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ప్రయత్నించి, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: మండల కేంద్రం గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో 342 మంది విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమి తెలిపారు. హెచ్ఎం సుంకన్న, సీహెచ్ఓ లోక్‌నాథ్, పీహెచ్ఎన్ అరుణ, ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరయ్య, సూపర్‌వైజర్ కృష్ణమోహన్ , వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగు బీకేఎస్ మండల పరిధిలోని కొర్రపాడులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులుఅందజేశారు. కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సీహెచ్ఓ మోహన్ కుమార్ హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్ పాల్గొన్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రాయ లసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం వారు మాట్లాడుతూ తలగాచిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మంది వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడం వల్ల ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు.రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించి, ఒకరికి ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఆంజనేయులు, చౌడప్ప, ఆది, రామలింగ పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి’

గుత్తి రూరల్: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న ఉర్దూ పాఠశాల హెచ్ఎం నూరున్నీసాపై దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలు బల్కిస్ సుల్తానాపై చర్యలు తీసుకోవాలని సోమవారం విద్యాకమిటీ చైర్మన్ సయ్యద్ రసూల్ ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ చైర్మన్‌తోపాటు కాలనీ వాసులు ఎ.రసూల్, ఎస్ఎం.బాషా మాట్లాడుతూ ఉపాధ్యాయిని బల్కిస్ సుల్తానా అసహజ ప్రవర్తన, నోటి దురుసు, విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యవహరించే తీరు సరిగ్గా లేదన్నారు. పాఠాల్లో సందేహాలు అడిగితే విద్యార్థులను వాతలు పడేలా కర్రలు, కాళ్లతో తంతోందని ఆరోపించారు.

‘ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచారు’

గుంతకల్లు: ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోయారని వక్తలు అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినీ నటుడు, మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు సినీ రంగ ప్రవేశం చేసి 75 ఏళ్లు నిండిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఆమ్లేట్ మస్తాన్‌యాదవ్ హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాముడు, చలపతి, లోకిరెడ్డి, యూసుఫ్, బషీర్, విశ్వనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు విద్యాసంస్థల ఒత్తిళ్లను నివారించండి’

గుంతకల్లు రూరల్: ఉచిత విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల పేరుతో యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఒత్తిళ్ల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులు జిల్లా గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు పట్టణానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎర్రిస్వామి, సునిల్, బ్రహ్మకుమార్, బషీర్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విలువలతో కూడిన విద్య అవసరం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత రంగాల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సత్య నారాయణ, రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఆది నారాయణరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

యల్లనూరు: ప్రతి ఇంటా మరుగుదొడ్లు నిర్మించుకుని ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సూచించారు. యల్లనూరు మండల కేంద్రంలో సోమవారం జెడ్పీ హైస్కూల్ నుంచి తేరు వరకూ విదార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సుప్రజారెడ్డి, వైద్యాధికారి లోకేష్, ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ, ఉపాధ్యాయులు శ్రీరంగయ్య, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ శిబిరం నిర్వహిస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌కాపీ, రెండు పాస్‌ఫోటోలు తీసుకోవాలన్నారు.

భారత్ గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె: సిలిండర్లను అధిక ధరలకు అందజేస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ చౌదరి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సిలిండర్ రూ.869 ధర ఉంటే ప్రజల నుంచి భారత్ గ్యాస్ నిర్వాహకులు రూ.950 నుంచి రూ.1,000 వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు.

యువతికి గాయాలు

తాడిపత్రిటౌన్: వీధి కుక్కలు వెంటపడడంతో స్కూటర్‌పై నుంచి కిందపడి ఓ యువతి తీవ్రంగా గాయపడింది.వివరాలు.. క్రిష్ణాపురంకాలనీకి చెందిన జయశ్రీ సోమవారం తెల్లవారుజామున స్కూటర్‌పై బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పుట్లూరు రోడ్డులో కుక్కలు వెంటపడ్డాయి. స్కూటర్ విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయండి

పెద్దవపూర్రు:ప్రజలకు బర్త్, ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని, దరఖాస్తు చేసిన వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయాలని తహసీల్దార్ బాలాజీకి సీపీఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, నాయకులు నారాయణస్వామి, చిరంజీవి, రామాంజనేయులు, మహబూబ్ బాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

గుత్తి రూరల్: గుత్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారా, అక్రమ మద్యం విక్రయాలు చేసిన పాత నేరస్తులను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవ ర్ చేశారు. నిందితులు జయమ్మ, నారమ్మ, సాయిరాం, శేఖర్, కంబగిరి, విజయ్‌ను రూ.లక్ష సొంత పూచీకత్తుతో తహసీల్దార్ ఓబిలేసు ఎదుట బైండోవర్ చేయించామని సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు అస్లాంబేగ్, గోపాల్ తెలిపారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు ఎస్‌వీవీ రమణయ్య

గుంతకల్లు: రాయదుర్గంలో డిసెంబర్ 1న నిర్వహించే యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌వీవీ రమణయ్య కోరారు. సోమవారం గుంతకల్లు పర్యటనలో భాగంగా రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం (యూటీఎఫ్) ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయదుర్గంలో ఏర్పాటు చేసిన జిల్లా మహాసభల్లో గుంతకల్లు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్ శంకరయ్య, కార్యకర్తలు చిన్నరంగన్న. విశ్వేశ్వరబాబు, నిర్మల్‌కుమార్, చలపతి, రామ్మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘కార్తీక’ పూజలు



తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



గుంతకల్లులోని బుగ్గ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



గుత్తిలోని కాశీ విశ్వేశ్వర దేవాలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు



పామిడిలో భోగేశ్వరస్వామి సహస్ర దీపాలంకరణ దృశ్యం

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్/గుత్తి/బుక్కరాయసముద్రం/పామిడి/యల్లనూరు: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి నుంచే పోలీసులు ఆలయం వద్ద బందోబస్తును నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే భక్తులు స్వామి దర్శనం కోసం ఆలయం వెలుపల బారులు తీరారు. సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదానం చేశారు.